
రైతుబజార్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆమ్రపాలి

క్షేత్రస్థాయికి వెళ్లండి..!

• కూకట్‌పల్లి జోన్‌లో ఆమ్రపాలి ఆకస్మిక తనిఖీలు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికాట కూకట్‌పల్లి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు రోజూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని జోనల్, డిప్యూటీ కమిషర్లను ఆదేశించారు. గురువారం కూకట్‌పల్లి, మూసాపేట, భరత్‌నగర్, రైతుబజార్ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. అనంతరం కేంద్ర కార్యాలయంలో జోనల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. జడ్‌సీ, డీసీలు తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించి.. జీహెచ్ఎంసీ చేపడుతోన్న ఒక్కో అంశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. చెత్త రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

బాలానగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్ వాహనదారులను హెచ్చరించారు. రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై గురువారం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి బాలానగర్ ప్రధాన రహదారి నైపర్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వెళ్తున్న 2 ఆటోలు, 8 బైక్‌లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. హెల్మెట్ లేకుండా ప్రయాణం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదమని తెలిసిన కొందరు పద్ధతిని మార్చుకోవడం లేదన్నారు.


ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు


మూసాపేట డీసీతో చర్చిస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

పదేళ్లలో కూకట్‌పల్లి అభివృద్ధి శూన్యం

కూకట్‌పల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆరోపించారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఆయా విభాగాల ఉన్నతాధికారులను ఆయన కలిశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తల మాదిరిగా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, వేణు, శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్, సయ్యద్ బాబు, లక్ష్మయ్య, విఠల్‌రెడ్డి, పుష్పారెడ్డి, తమ్మినేని వేణు, శివచౌదరి పాల్గొన్నారు.

పేరుకు పోయిన చెత్తతో సీజనల్ వ్యాధులు

షాపూర్‌నగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతోంది. చాలా రోజులుగా చెత్త తొలగించకపోవడంతో సీజనల్ వ్యాధులు సంక్రమించే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్‌లోని న్యూ షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, నెహ్రూనగర్, మార్కండేయనగర్, కళావతినగర్, రాజీవ్‌గాంధీనగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా చెత్త పేరుకపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. చెత్తపై ఈగలు, దోమలు స్వైరవిహారం చెయ్యడంతో విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ, వైద్య సిబ్బంది సకాలంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


హెచ్ఏఎల్ కాలనీ ఎల్ఎన్‌టీ కంపెనీ వద్ద పేరుకుపోయిన చెత్త

ఎమ్మెల్యే గాంధీని కలిసిన జోనల్ కమిషనర్

వివేకానందనగర్‌కాలనీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజాసమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని జడ్సీని కోరారు.


ఎమ్మెల్యేని తన నివాసంలో కలిసిన జడ్సీ ఉపేందర్‌రెడ్డి

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

అల్లాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని వార్డు కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన డివిజన్ అభివృద్ధి పనుల సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. డివిజన్‌లోని అన్ని కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలపై ఫిర్యాదులను ఎమ్మెల్యే సమక్షంలో అధికారులకు ఫిర్యాదు చేయగా, వాటన్నిటిని పరిశీలించి పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగం, గౌసుద్దీన్, లింగాల అయిలయ్య, జీహెచ్ఎంసి అధికారులు, జలమండలి, విద్యుత్‌శాఖ అధికారులు, వీరారెడ్డి, నాగుల సత్యం, పిల్లి తిరుపతి, పార్వతమ్మ, ముత్యాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులను పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ ఇంద్రహిల్స్, మహంకాళీనగర్‌లోని సీసీరోడ్ల పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న శివాలయం వద్ద పైపులైను పగిలి రోడ్డు మీద నీరు పారుతుండటంతో అధికారులతో మరమ్మతులు చేయించారు. సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, వెంకటేష్‌నాయక్, షౌకత్‌అలీ, నాగేష్‌గౌడ్, రవీందర్, రాజుగౌడ్, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

మియాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట లక్కీ హుకా సెంటర్‌పై మాదాపూర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. కొన్ని రోజులుగా ఇక్కడ నిషేధిత హుక్కా అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించగా 250 ఫ్లేవర్స్ నిషేధిత హుక్కా ప్యాకెట్లు, పైపులను సీజ్ చేసి మియాపూర్ పోలీసులకు అప్పగించారు. నిర్వాహకులు షేక్ మహ్మద్, మహ్మద్ సోయబ్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో పిచ్చికుక్క స్వైరవిహారం

• వెంటపడి పరుగెత్తిస్తూ దాడి • అధికారులకు ఫిర్యాదు చేస్తే 48 గంటల్లో పరిష్కరిస్తామని సమాధానం • ప్రజల ఆగ్రహం

బాలానగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ అక్షయ్ ఎన్‌క్లేవ్ పారిశ్రామికవాడలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిపై దాడి చేసింది. చిన్నపెద్ద తేడా లేకుండా ఎదురుపడిన వారిని కరిచింది. కర్రలతో బెదిరించిన వారిని వెంబడిస్తూ పరుగులు పెట్టించింది. దీంతో అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో పని చేస్తున్న కార్మికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు.


దాడి చేసిన వీధికుక్క



కుక్క కాటు గాయాలు


గాయపడిన చిన్నారి

• కరుస్తూ... పరుగెత్తిస్తూ

అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో పిచ్చి కుక్క చూపించిన భయానక సీన్‌తో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం రోజు ఏకంగా ముగ్గురు చిన్నారులను, శోభనాకాలనీలో కూరగాయల మార్కెట్‌లో మరో ఆరుగురిపై దాడి చేసి గాయపరచింది. అక్కడే సంచరిస్తున్న వీధికుక్కలపై సైతం దాడి చేసి వాటిని పరుగులు పెట్టించింది. బుధవారం రాత్రి నుంచి పిచ్చి ముదిరి కనబడిన వారిపైనా దాడి చేసింది. కుక్క భయానికి అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో కొంత మంది కార్మికులు బయటకు రావడం మానేశారని స్థానికులు చెబుతున్నారు. దీంతో కుక్కకాటుకు గురైన వారు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

• అధికారులకు సమాచారం ఇచ్చినా..

పిచ్చి కుక్క ప్రజలను కరుస్తోందని కూకట్‌పల్లి సర్కిల్(23) వెటర్నరీ అధికారికి సమాచారం ఇచ్చామని, ఆయన జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చి దానికి ఫోన్ చేసి చెప్పమన్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారి ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే 48 గంటల్లో కుక్క సమస్యను పరిష్కరిస్తామని ఫోన్లో మహిళ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని వారు తెలిపారు. గంటల వ్యవధిలోనే పిచ్చికుక్క వీరంగం సృష్టించిన విషయం అధికారులకు చెప్పినా స్పందించక పోవడం ఏమిటని, ప్రజల ప్రాణాలంటే అధికారులకు పట్టింపు లేదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి పిచ్చి కుక్కలను బంధించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.


చెరువులు, కుంటల్లో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలి

గచ్చిబౌలి, జులై 4 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చెరువులు, కుంటల్లోకి మురుగునీరు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గోపిచెరువు, నల్లగండ్ల పెద్ద చెరువు, ఖాజాగూడ చెరువులను డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక కాలనీల నుంచి వచ్చే మురుగునీరు చెరువుల్లోకి రాకుండా మళ్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపునీరు మాత్రమే చెరువులోకి వచ్చేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల కబ్జాలు అడ్డుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ నిరంతర పర్యవేక్షణ అవసరమని, కబ్జాలు కాకుండా చొరవ చూపాలన్నారు. డీఈ నళిని, ఏఎంహెచ్‌వో డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ వైద్యాధికారి తీరుపై ఎస్ఎఫ్ఏల నిరసన

కూకట్‌పల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మూసాపేట సర్కిల్ సహాయ వైద్యాధికారి(ఏఎంవోహెచ్) సాల్మన్ రాజు పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్ఎఫ్ఏ) గురువారం మూసాపేటలోని సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, వారికి అందించాల్సిన సామగ్రి (సున్నం, బ్లీచింగ్, చీపుర్లు) సకాలంలో అందించాలంటూ గురువారం ఏఎంవోహెచ్ సాల్మన్‌రాజ్‌ను ఆయన క్యాబిన్‌లో సర్కిల్‌కు చెందిన 40 మంది ఎస్ఎఫ్ఏలు కోరారు. ఏఎంవోహెచ్ స్పందిస్తూ ఎస్ఎఫ్ఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నన్ను ప్రశ్నించే ధైర్యం మీకుందా.. ఉన్నతాధికారులకు నాపై ఫిర్యాదు చేస్తారా..' అంటూ దుర్భాషలాడారని ఎస్ఎఫ్ఏలు ఆరోపించారు. సాల్మన్‌రాజ్ తీరుకు నిరసనగా సర్కిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం సర్కిల్ ఉపకమిషనర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.


సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఏలు


సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు గాంధీ, కృష్ణారావు

అల్లూరి ఓ మహోజ్వల శక్తి

హైదర్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు ఓ మహోజ్వల శక్తి, ఆయన జరిపిన సాయుధ, స్వతంత్ర పోరాటం ఒక ప్రత్యేక అధ్యాయమని ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఉషాముళ్లపూడి కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేలు కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన మహానీయుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, సతీష్, క్షత్రియాత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

• అల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

జీడిమెట్ల: మన్యంవీరుడు అల్లూరి జయంతిని సూరారం కాలనీ తెలుగుతల్లినగర్‌లో విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

• దుండిగల్/పేట్‌బషీరాబాద్: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని ప్రగతినగర్‌లోని ఆయన విగ్రమానికి, నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

• కూకట్‌పల్లి: అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నెంబర్ 1తో పాటు ఉషాముళ్లపూడి రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పాల్గొని అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు.

నానో మెటీరియల్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

సదరన్ డెన్మార్క్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వైకే మిశ్రా

పటాన్‌చెరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నానో మెటీరియల్‌కు ప్రాధాన్యం పెరుగుతున్నదని, వాటిపై విశేష రీతిలో పరిశోధనలు జరుగుతున్నట్టు దక్షిణ డెన్మార్క్ విశ్వవిద్యాలయంలోని స్మార్ట్ మెటీరియల్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ యోగేంద్ర కుమార్ మిశ్రా చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అధునాతన సాంకేతికతల కోసం టెట్రా పోడ్స్ ఆధారిత స్మార్ట్ మెటీరియల్స్ అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్మార్ట్ 3డీ నానో మెటీరియల్స్ అభివృద్ధిలో సంక్లిష్ట ఆకారపు నానోస్ట్రక్చర్ల ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. జింక్ ఆక్సైడ్ టెట్రాపోడ్‌లను సంశ్లేషణ చేయడం కోసం జ్వాల ఆధారిత ఒక అడుగు (సింగిల్ స్టెప్) విధానాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు వివిధ సాంకేతిక అనువర్తనాలలో వాటి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకుల సందేహాలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తొలుత, భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సయన్ చౌదరి అతిథిని పరిచయం చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. భౌతిక, రసాయన శాస్త్రాల విభాగాధిపతులు ప్రొఫెసర్ టి. విశ్వం, డాక్టర్ గౌసియా బేగం తదితరులు స్మార్ట్ మెటీరియల్స్ రంగంలో చేసిన విలువైన కృషిని గుర్తిస్తూ ప్రొఫెసర్ మిశ్రాను సత్కరించారు.


ప్రొఫెసర్ వై.కె.మిశ్రాను సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

నార్కొటిక్ పోలీసుల దాడులు

155 కిలోల గంజాయి స్వాధీనం

ఎనిమిది మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులతో కలిసి నగరంలో పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్‌న్యూ) పోలీసులు దాడులు చేసి ఎనిమిది మంది గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. మూడు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 155 కిలోల గంజాయి, స్కార్పియో కారు, పాసింజర్ ఆటో, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషా మల్కాన్‌గిరికి చెందిన మంజిత్ థాలి అలియాస్ జీతు గంజాయి స్మగ్లర్. ఇతడు గతంలో పలు కేసుల్లో అరెస్టయ్యాడు. ఇతడు ఒడిషా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన అనిల్ ధానాజీ ఘూంటే, శుశాంత్ మిశ్రీ, సుమంత్ మండల్‌లతో కలిసి గంజాయి దందా చేస్తున్నాడు. పక్కా సమాచారమందుకున్న పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. మరో కేసులో ఆసిఫ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న జి దేవరాజ్ సింగ్‌ను అరెస్ట్ చేశారు.

• రౌడీషీటర్ గంజాయి దందా

మంగళ్‌హాట్‌కు చెందిన ఎస్. లఖన్‌సింగ్ అలియాస్ లఖన్ అలియాస్ గోరుపై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రౌడీషీటర్ నమోదై ఉంది. హత్య, హత్యాయత్నం, బెదిరింపులు వంటి కేసుల్లో నిందితుడిగా ఉన్న లఖన్‌సింగ్ గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. అతడిపై మూడు ఎన్‌డీపీఎస్ కేసులు ఉండటంతో పీడీయాక్ట్ కూడా నమోదు చేశారు. జైలు నుంచి విడుదలైన అతడు గంజాయి దందా చేస్తున్నాడు. లఖన్‌సింగ్ ఈస్ట్ గోదావరి ప్రాంతానికి చెందిన చిన్న రాథోడ్ గోవింద్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. హెచ్‌న్యూ పోలీసులు లఖన్‌సింగ్‌తో పాటు రాథోడ్ గోవింద్‌ను కూడా అరెస్ట్ చేశారు.

జేఎన్‌టీయూ కాలేజీలకు తీరనున్న సిబ్బంది కొరత

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి వీసీ సుముఖత

ఔట్‌సోర్సింగ్ కింద ల్యాబ్ టెక్నీషియన్లను నియమించాలని నిర్ణయం

హైదరాబాద్ సిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో సిబ్బంది కొరతపై ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా కాంట్రాక్టు పద్ధతిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను, ఔట్‌సోర్సింగ్‌లో ల్యాబ్ టెక్నీషియన్లను నియమించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. దశాబ్దన్నర కాలంగా జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల్లో ఆచార్యుల, బోధనేతర సిబ్బంది నియామకం జరగకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య కరువైంది. రెగ్యులర్ సిబ్బంది రిటైరవుతుండడం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాలకు గత సర్కారు విముఖత వ్యక్తం చేయడంతో విద్యార్థుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ప్రతియేటా కొత్త కోర్సులు ప్రవేశపెడుతుండడం, వేలసంఖ్యలో విద్యార్థులు వస్తుండడంతో ఆచార్యులపై అదనపు భారం పడుతోంది. ఈ అంశాలన్నీ ఇటీవల ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం దృష్టికి రావడంతో.. వర్సిటీల్లో అవసరమైన మేరకు బోధన, బోధనేతర సిబ్బందిని నియమించుకునేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇన్‌చార్జి వీసీ ఆదేశాల మేరకు హైదరాబాద్ జేఎన్‌టీయూ కాలేజీతో పాటు సుల్తాన్‌పూర్, మహబూబాబాద్, సిరిసిల్ల, పాలేరు, వనపర్తి, జగిత్యాల, మంథని కాలేజీల నుంచి సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులు సమాచారం తెప్పించుకుంటున్నారు. కాంట్రాక్టు పద్ధతిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ఇన్‌చార్జ్ వీసీ పచ్చజెండా ఊపడంతో.. మాజీ వీసీ హయాంలో ఎమరిటస్ ప్రొఫెసర్లుగా నియమితులైన రిటైర్డు ప్రొఫెసర్లను వెనక్కి పంపే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

బాలానగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నీ బంద్‌కు మద్దతు పలుకుతూ బుధవారం సాయంత్రమే విద్యార్థులకు వాట్సప్ మెసేజ్ ద్వారా స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించినట్లు సమాచారం ఇవ్వడంతో విద్యార్థులు పాఠశాలలకు రాలేదు. తెరచి ఉంచిన పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు వచ్చి మూసి వేయించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. బాలానగర్, ఫతేనగర్, ఓల్డుబోయినపల్లి డివిజన్‌లలో విద్యాసంస్థల బంద్‌తో పాఠశాలలన్నీ మూగబోయాయి. దేశవ్యాప్తంగా నీట్ పరీక్షను రద్దు చేయాలని ఇచ్చిన బంద్ పిలుపుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు సానుకూలంగా స్పందించి స్కూళ్లను మూసివేసినందుకు విద్యార్థి సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు సమస్యల పరిష్కారానికి మొబైల్ యాప్

ఏఐ టెక్నాలజీతో 'గ్రోవర్' మొబైల్ యాప్ ఆవిష్కరణలు

రాయదుర్గం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు పరిష్కారం చూపే విధంగా మొబైల్ యాప్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని గ్రోవర్ టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. కొత్తగూడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కంపెనీ ప్రతినిధులతో కలిసి గ్రోవర్ టెక్నాలజీస్ దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌కు అనుసంధానం చేసి రూపొందించిన మొబైల్ అప్లికేషన్స్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రోవర్ టెక్నాలజీస్ గ్రౌండ్ బ్రేకింగ్ కొత్త కేటగిరి ఉత్పత్తుల యొక్క వినూత్న పరిష్కారాల గురించి ఎకో బూస్టర్ బ్రాండ్ కింద గ్రోనయన్ రూపంలో సాంకేతిక ఆవిష్కరణలను రూపొందించి రైతులకు అందించాలనే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుంటే రైతులకు ఆయా ప్రాంతాల్లో భూసార సాంద్రత, వాతావరణ పరిస్థితులను బట్టి ఏ పంటలకు ఆ భూమి అనువైనది, ఏ మొత్తాదులో పంటకు ఎరువులు, నీరు అందించాల్సి ఉంటుంది అనే అంశాలను సూచించడంతో పాటు రాబోయే 15 రోజుల్లో వర్షాలను పడే అవకాశం ఉందా లేదా అనే అంశాన్ని అంచన వేసి చెబుతుందన్నారు. 15 రోజులు పాటు వర్షాలు కురవకపోతే ఆ పంటలకు నీటి కొరత లేకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ఈ అప్లికేషన్ సూచిస్తుందన్నారు. ఇప్పటి వరకు తమ కంపెనీ మూడు సంవత్సరాలుగా పని చేస్తుందని, తమ మొబైల్ అప్లికేషన్ 95 నుంచి 98 శాతం కచ్చితమైన ఫలితాలను అందించిందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో వరి, గోధుమ, పత్తి, మిరప, మొక్కజొన్న, చెరకు, పండ్లు వంటి పంటలపై తాము చేసిన పరిశోధనలు మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ దాసరి, సీఈవో నవదీప్ మెహతా పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న కంపెనీ ప్రతినిధులు

జట్టుగా ఉంటేనే విజయాలు

ఫిక్కీ సదస్సులో టైటాన్ వాచ్ డివిజన్ సీఈఓ సుపర్ణ మిత్ర

రాయదుర్గం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జట్టుగా ఉంటేనే విజయాలు సాధించగలమని, ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే వారే సంస్థను విజయపథంలో నిలుపుతారని టైటాన్ వాచెస్ వేరబుల్ డివిజన్ సీఈఓ సుపర్ణ మిత్ర అన్నారు. టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 'టాటా లెగసీ-లివింగ్ వ్యాల్యూస్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల చేతి గడియారాల కొనుగోళ్లు పడిపోయాయని, కరోనా తర్వాత తిరిగి పుంజుకున్నాయన్నారు. సెల్‌ఫోన్ వంటి ఎన్ని ఉపకరణాలు వచ్చినా స్టేటస్ సింబల్‌గా మారిన చేతి గడియారాలకు డిమాండ్ తగ్గదన్నారు. టైటానిక్‌ను అత్యంత విశ్వసనీయ బ్రాండ్‌గా మార్చడంలో మహిళల పాత్ర గురించి మాట్లాడుతూ, ఒక వ్యక్తి కంటే మహిళలు కలిసి పనిచేస్తే చాల అందంగా ఉంటారని వాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్‌తో పాటు ఫిక్కీ సభ్యులు పాల్గొన్నారు. ఉక్కు నుండి ఆటోమొబైల్స్ వరకు, ఐటీ నుంచి వినియోగ వస్తువులు, తినదగినవి నుండి ధరించగలిగే వస్తువులు, సమాజానికి తిరిగి ఇవ్వాలనే వారి లోతైన నమ్మకానికి నిదర్శనమని అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు


మోహనరంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

కూకట్‌పల్లిలో వంగవీటి రంగా జయంతి

• నివాళులర్పించిన జనసేన నాయకులు

కూకట్‌పల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా జయంతి పురస్కరించుకొని శ్రీకృష్ణదేవరాయ కాపు యువసేన ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. రంగా జయంతి సందర్భంగా కూకట్‌పల్లి మయూరినగర్‌లోని వృద్ధుల సంక్షేమ కేంద్రంలో జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత ఆశ్రమ ప్రాంగణంలోని శిశుమందిర్ విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు హెచ్ఎస్ మూర్తి, కొల్లా శంకర్, కలిగినిడి ప్రసాద్, యర్రా రఘు, ఆవుల రంగబాబు, ఆత్మూరి మోహన్, గడ్డం వీరా, అడపా శేషు, చైతన్య, హనుమంతు, పాదం సూర్య, యోగేష్ భోగది, పులగం సుబ్బు, షణ్ముఖ పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య: సీపీఐ

బాలానగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యను తెలంగాణ బిడ్డలెవ్వరూ మర్చిపోలేదని సీపీఐ నేతలు అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధి శ్రీనగర్ సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

టీజేఎస్‌లోకి డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ తెలంగాణ జనసమితి (టీజేఎస్)లో సభ్యత్వం స్వీకరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కండువా కప్పి శ్రీనివాస్ ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో ముదిరాజ్ రిజర్వేషన్ల సమస్య పరిష్కృతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.